సంఘటితంగా.. సంక్షేమం వైపు

- ఓబీసీ ఉద్యోగుల సేవలో స్టీల్ ఓబీసీ సంక్షేమ సంఘం
- పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వెన్నుదన్నుగా...
- మరణించిన వారి కుటుంబాలకు బాసటగా సంఘం సేవలు



రిటైర్డ్ ఉద్యోగిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఓబీసీ అసోసియేషన్ లోగో

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగులకు ఆ సంక్షేమ సంఘం తన వంతు సేవలందిస్తూ ముందుకు సాగుతోంది. గత కార్యవర్గం కొన్ని పథకాలు అమలు చేయగా ప్రస్తుత కార్యవర్గం వాటిని విస్తృత పరుస్తూ కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం యాజమాన్యం నుంచి అధికారికంగా గుర్తించబడింది. యాజమాన్యం ఆ సంఘానికి ఎన్నికలు నిర్వహించి వారి ప్రయోజనాల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. స్టీల్‌ప్లాంట్‌లో మొదట్లో సుమారు 4500 మంది ఓబీసీలు ఉన్నప్పటికి వారిలో అనైక్యత వల్ల వివిధ సంఘాలుగా ఏర్పడి ఎటువంటి ప్రయోజనం సాధించలేకపోయారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కొంత మంది ఓబీసీ ఉద్యోగులు అందరినీ ఏకతాటి పైకి తీసుకొచ్చి తమను గుర్తించాలని యాజమాన్యానికి నివేదించారు. దీంతో 2017 మార్చి 24న యాజమాన్యం ఓబీసీ అసోసియేషన్‌కు అధికారిక గుర్తింపు ఇచ్చింది. ఇప్పటికి 4 వేల మంది సభ్యులు రిజిస్టర్ అయ్యారు. యాజమాన్యం ఓబీసీ అసోసియేషన్‌కు లైజన్ ఆఫీసర్‌ను నియమించింది. ఎంఎం విభాగం డీజీఎం గంటా అప్పారావును మొదటి లైజన్ ఆఫీసర్‌గా నియమించారు.

మొదటి కార్యవర్గం ఆధ్వర్యంలో..

పూర్వ కార్యవర్గం ఆధ్వర్యంలో సభ్యుల నుంచి ప్రతి నెల రూ. 20 సభ్యత్వ రుసుం శాలరీ కటింగ్ ద్వారా సేకరించడం ప్రారంభించారు. ఆ నిధుల ద్వారా రిటైర్ అయ్యే ఓబీసీ సభ్యులను శాలువా, మెమెంటోలతో సత్కరించడం ప్రారంభించారు. అదే విధంగా 'ఆ నలుగురు 'పథకం ద్వారా చనిపోయిన ఓబీసీ సభ్యుని కుటుంబానికి అందజేయడం ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది.



మరణించిన ఓబీసీ ఉద్యోగి కుటుంబానికి సాయం చేస్తున్న ప్రతినిధులు

ప్రస్తుత కార్యవర్గం ఆధ్వర్యంలో..

ప్రస్తుత కార్యవర్గం ఆధ్వర్యంలో పలు పథకాలు ప్రవేశపెట్టారు. అంతకు ముందు కార్యవర్గం ప్రవేశపెట్టిన ఆ నలుగురు పథకం, రిటైర్డ్ ఉద్యోగికు సన్మాన కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు ఇతర కొత్త పథకాలు ప్రవేశపెట్టారు. లైజన్ ఆఫీసర్ గంటా అప్పారావు పదవీ విరమణ చేయడంతో పీపీఎం విభాగం డీజీఎం ఉమా మహేశ్వరరావును లైజన్ ఆఫీసర్‌గా నియమించారు.

ఓబీసీ కుటుంబానికి సాయం..

కొత్తగా సభ్యుల నుంచి డెత్ ఫండ్‌ను జీతం ద్వారా సేకరిస్తున్నారు. ప్రతి సభ్యుని ద్వారా రూ. 25 సేకరించి మృతి చెందిన ఓబీసీ సభ్యుని కుటుంబానికి మొదట్లో రూ. 75 వేల నగదు అందజేసేవారు. వీఆర్‌ఎస్, ఉద్యోగుల రిటైర్‌మెంట్ ఎక్కువగా ఉండటంతో సభ్యుల సంఖ్య 2500కు తగ్గిపోయింది. దీంతో ఆ కుటుంబాలకు రూ. 64,400 అందజేస్తున్నారు.

ఓబీసీ యాప్ ప్రారంభం..

స్టీల్‌ప్లాంట్‌లో ఓబీసీ ఉద్యోగుల సౌకర్యార్థం ఒక యాప్‌ను ప్రారంభించారు. ఈ యాప్‌లో ఓబీసీ ఉద్యోగుల పూర్తి వివరాలు అందుబాటులోకి రానున్నాయి. వారి సర్వీసు, విభాగం, పదవీ విరమణ తదితర వివరాలను పొందుపరిచారు.

భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రణాళిక..

ఓబీసీ ఉద్యోగుల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా సభ్యులందరికీ ఉపయోగపడేలా మంచి బహుమతి ఇవ్వాలనుకుంటున్నారు. గంట్యాడలోని కళా వేదికకు జ్యోతిరావు పూలే కళావేదికగా పేరు మార్చడానికి యాజమాన్యాన్ని ఒప్పించారు. ఓబీసీ ఉద్యోగుల సౌకర్యార్థం ఓబీసీ సెల్ ఏర్పాటు కోసం యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

పూలే, సావిత్రి విగ్రహాల ప్రతిష్ఠ

అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీల ఆరాధ్యదైవం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో ప్రతిష్ఠించారు. ప్రతి ఏటా పూలే, సావిత్రిబాయి జయంతి, వర్ధంతులు నిర్వహిస్తూ వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు.





రిటైర్డ్ ఉద్యోగికి సిల్వర్ కాయిన్..

పదవీ విరమణ చేసే ఉద్యోగులకు 75 గ్రాముల సిల్వర్ కాయిన్ అందజేయడం ప్రారంభించారు. అదే విధంగా యువ కార్మికుల భవిష్యత్ కార్యక్రమాల నిర్వహణకు ప్రతి నెలా కొంత నగదు డిపాజిట్ చేస్తున్నారు. ప్రస్తుతం రూ. 2,15,00 నగదు డిపాజిట్ చేశారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి



సభ్యుల సహకారంతో మా కార్యవర్గం అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. మా ప్రయాణంలో యాజమాన్యం సహకారం మరువలేనిది.

– బి. అప్పారావు,
అధ్యక్షుడు, స్టీల్ ఓబీసీ అసోసియేషన్

పటిష్టంగా ఓబీసీ అసోసియేషన్



మా కార్యవర్గం చేపట్టిన కార్యక్రమాల ద్వారా అసోసియేషన్‌ను పటిష్ఠ పరిచాం. జాతీయ ఓబీసీ కమీషన్ భాగస్వామ్యంతో కలిసి మరింత విస్తృత పరచాలని యోచిస్తున్నాం. కమీషన్ సలహాతో అసోసియేషన్ మరింత బలపడేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కోయిలాడ శ్రీనివాసరావు,
ఉప ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఓబీసీ అసోసియేషన్

క్లుప్తంగా

భగవాన్ విశ్వకర్మకు పూజలు



విశ్వకర్మకు పూజ చేస్తున్న గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది

పెదగంట్యాడ : సంప్రదాయాలను గౌరవించాలని, అలాగే చేతి వృత్తులకు మూలపురుషుడు విశ్వకర్మ భగవాన్ అని అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు అన్నారు. శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని అదానీ గంగవరం పోర్టులో గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచపు తొలి వాస్తు శిల్పిగా, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారని, కృష్ణుడు పాలించిన ద్వారకానగరం వంటి పలు నగరాలు నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయన్నారు. అనంతరం విశ్వకర్మ భగవాన్ చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అదానీ గంగవరం పోర్టు ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వొద్దని వినతి



పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ : మండలంలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును కార్పొరేటర్లు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల దుమ్ము ధూళి ఎగసి పడుతోందని, తద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వచ్చే నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొని దీనిని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరావు, నమ్మి రమణ, శ్రీను, అప్పలరెడ్డి, కణితి అప్పలరాజు, శ్రీను, వై.అప్పలరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పెదగంట్యాడ : వినాయకనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినాయక నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా, ఆదర్శగ్రౌండ్ ఏరియా, వుడా కాలనీ మెయిన్ రోడ్డు, వినాయకనగర్, చైతన్య కాలేజీ వెనుక, వేంకటేశ్వరస్వామి టెంపుల్ వెనుక ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూర్మన్నపాలెం : 33 కేవీ దువ్వాడ వీఎస్ఈజెడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని కేబీఆర్, భరత్ నగర్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ బీకే నాయుడు తెలిపారు. రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ, వుడా ఫేజ్ – 1, 3, ఫేజ్ – 7, మాతృశ్రీ లే అవుట్, దువ్వాడ స్టేషన్ రోడ్డు, వీఎస్ఈజెడ్ పరిధిలోని అన్ని యూనిట్లు, భరత్‌నగర్, ముస్తాఫా జంక్షన్, ఐటీఐ రోడ్డు, శ్రీకృష్ణానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

దుర్గాదేవి పూజ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గాజువాక : పాత గాజువాకలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి ప్రారంభించనున్న దసరా శరన్నవరాత్రుల పూజలకు సంబంధించిన పుస్తకాన్ని గాజువాక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు. 11 రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో ఏ రోజు ఏ పూజ నిర్వహించనున్నారు..., ఎవరు నిర్వహిస్తారు వంటి వివరాలు గల పుస్తకాన్ని సభ్యులకు అందజేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు మహిళలతో ఉదయం 5.30 గంటలకు దేవీ సుప్రభాత సేవ, సాయంత్రం నాలుగు గంటల నుంచి అగ్ని ప్రతిష్ఠాపన, లక్ష్మీ గణపతి వాసవి మూలమంత్ర మహాసౌర చండీ హోమాలు నిర్వహించనున్నట్టు సంఘం ప్రతినిధులు తాలూరి మల్లేశ్వరరావు, కులుకూరి మంగరాజు తెలిపారు. కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ సభ్యులు సన్నిధి పద్మ, రామ్మూర్తి, కోట అనంత గోపాలరావు, పాబోలు ఆంజనేయులు, వుడా వరహాలశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు



గాజువాక మెయిన్ రోడ్‌లో జేసీబీతో దుకాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది



గాజువాక మెయిన్ రోడ్‌లో దుకాణాన్ని ఖాళీ చేయిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది



గాజువాక మెయిన్ రోడ్‌లో ఫుట్‌పాత్‌పై దుకాణం తొలగించిన దృశ్యం

గాజువాక : గాజువాక మెయిన్ రోడ్‌లోని ఫుట్‌పాత్‌పై గల దుకాణాలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం తొలగించారు. నగరంలో వివిధ చోట్ల దుకాణాల తొలగింపును చేపట్టిన టౌన్‌ప్లానింగ్ అధికారులు గాజువాకలో కూడా పలు దుకాణాలను తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో జేసీబీతో పడగొట్టారు. అయితే తమ యూనియన్ నాయకులు అందుబాటులో లేని కారణంగా తమకు కొంత సమయం ఇవ్వాలని దుకాణాల నిర్వాహకులు అధికారులను కోరారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల కారణంగా తాము సమయం ఇవ్వలేమని, తొలగించాలని ముందుగానే సమాచారం ఇచ్చినందున ఖాళీ చేయాలని చెప్పిన అధికారులు వాటిని జేసీబీతో తొలగించారు. ఫుట్‌పాత్‌లను నడిచి వెళ్లేవారి కోసం మాత్రమే ఉపయోగించాలని, మళ్లీ ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కళాశాలకు జాతీయ స్థాయి అవార్డులు



జాతీయ స్థాయి బెస్ట్ ఫెర్ఫార్మింగ్ అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: ఏఐసీటీఈ ఆధ్వర్యంలో ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల బెస్ట్ ఫెర్మార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు అందుకుంది. సిమ్లాలో ఈనెల 17 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన నెక్స్‌జెన్ స్కిల్స్ ఎన్‌క్లేవ్ కార్యక్రమంలో ఈ అవార్డును కళాశాల తరపున ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అందుకున్నారు. అలాగే ప్రిన్సిపాల్ ఎక్సలెన్సీ అవార్డును ప్రిన్సిపాల్ సుధాకర్ అందుకోవడం విశేషం. డీన్ ఎక్సలెన్సీ అవార్డును ఈసీఈ విభాగాధిపతి ఆర్. ఉమామహేశ్వరి, బెస్ట్ ఫెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్‌కు రెండు విభాగాల్లో అవార్డులు అందాయని రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు ఈ సందర్భంగా మధుసూదనరావు, ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఐదు అవార్డులు కళాశాల దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల ప్రోత్సాహంతో కళాశాలకు ఈ గుర్తింపు లభించిందన్నారు.

ఏటీఎల్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత

సింహాచలం: అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం పెరుగుతోందని ఏపీ యునిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ తెలిపారు. వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో జిల్లాలోని 9 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జ్‌లతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎల్‌లు విద్యార్థులను భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలుగా మారేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎయిమ్ పోర్టల్ గురించి తెలిపి, నెలవారీ కార్యక్రమాలను వివరించారు. విశాఖ జిల్లా సైన్స్ అధికారి(డీఎస్‌వో) రాజారావు మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఒక ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ రూపొందించి, విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలని సూచించారు.

ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ రాజీనామా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎన్. రావు తన పదవికు రాజీనామా చేశారు. 2021 జనవరిలో కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకంపై నిర్ణయం తీసుకుంది. దాంతో ప్లాంట్ పరిరక్షణకు ఉక్కు పరిక్షణ పోరాట కమిటీ ఏర్పాటైంది. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలిచిన తర్వాత గుర్తింపు యూనియన్ అధ్యక్షునిగా ఉన్న కె.ఎస్.ఎన్.రావు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఆయన హయాంలో పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్దగా కార్యక్రమాలు చేపట్టలేకపోయారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. గత కొంత కాలంగా ఆయనపై సోషల్ మీడియాలో పలు ఆరోపణలు చేస్తున్నారు. అనేక మంది చేస్తున్న అవమానకర వ్యాఖ్యలు, వ్యక్తిగత కారణాల వల్ల పదవి నుంచి వైదొలుగుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



తిరుమలనగర్‌లో స్వచ్ఛోత్సవంలో స్థానికులు

కూర్మన్నపాలెం : ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, సీజన్‌లో మార్పులు వస్తున్న కారణంగా విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డు శానిటరీ కార్యదర్శి దేముడు సూచించారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లో స్వచ్ఛోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించొచ్చని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని సూచించారు. ప్లాస్టిక్ సంచులు, వస్తువులు వాడొద్దని... మార్కెట్‌కు వెళ్లేటప్పుడు నార, క్లాత్ సంచులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో తిరుమలనగర్ సంఘ నాయకులు విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, రాము, కామరాజు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదిక్పై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

కల్యాణ వేంకటేశ్వరునికి అలంకరణోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించిన దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతి నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం పంచామృతాభిషేకం, స్వామి వారి అలంకరణోత్సవం ఘనంగా జరిపించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలు మామిడిపల్లి సత్యనారాయణమూర్తి, భానుమతి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఈ.కె. చారి దంపతులు, సాహెబ్‌నాయుడు, కృష్ణారావు, నరసింగరావు మాస్టర్, సోమశేఖర్, మోహిని, నాగలక్ష్మి, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, గురునాథ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతే లక్ష్యం



అప్పికొండ బీచ్‌లో చెత్త తొలగించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ: పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని విజ్ఞాన్ పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ తెలిపారు. కోస్టల్ క్లీనప్ వారోత్సవాల్లో భాగంగా చేపలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, స్కౌట్స్ అండ్ గైడ్స్, విజ్ఞాన్ పాఠశాల ఆధ్వర్యంలో అప్పికొండ తీరంలో గురువారం చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోస్టల్ క్లీనప్ కింద నెలలో ఒకరోజు బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ర్యాలీ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ నోడల్ అధికారి కృష్ణవేణి, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం కూరపాటి వినోద్‌కుమార్, సిబ్బంది ఎస్‌పీ రమ, ఆదిశంకర్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దైనందిన జీవితంలో నడక భాగం కావాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: దైనందిన జీవితంలో నడక ఒక భాగం కావాలని వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గొల్లవిల్లి కనక భవానీ అన్నారు. క్లబ్ సారథ్యంలో నడువు.. నడిపించు కార్యక్రమంలో భాగంగా 20 సంవత్సరాల వయసు వారికి పరుగు పందెం, 60 సంవత్సరాలు పైబడిన మహిళలకు నడక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కనక భవానీ మాట్లాడుతూ మహిళలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని అధిగమించడానికి నడక తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఇందిరాదేవి, శశికళ, జయ, అనిల్ కుమార్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం డిపో ఖాళీ చేయించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ఉక్కునగరం : కూర్మన్నపాలెంలోని ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో ఖాళీ చేయించకుండా కూటమి నాయకులు చూడాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. గురువారం స్టీల్ సిటీ డిపోలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ డిపో స్థలం స్టీల్‌ప్లాంట్ పరిధిలో ఉండడంతో ఖాళీ చేయమని నోటీసులు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 10న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను కలిసి లీజు గడువు మరో 33 ఏళ్లు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని తమ యూనియన్ తరపున విజ్ఞప్తి చేశామన్నారు. ప్రస్తుత లీజు కొనసాగాలంటే రూ.133 కోట్లు డిపాజిట్ చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం డిమాండ్ చేస్తుండగా ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిపాజిట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య, జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. మూర్తి, కె.శ్రీనివాసరావు, పి.భానుమూర్తి, నందమూరి రామారావు, కె.శుభాకర్, బి.కృష్ణమూర్తి, జి.తాతాలు పాల్గొన్నారు.